క్లుప్తంగా

ఘనంగా ఆంజనేయస్వామి పడిపూజ



రావిరాల(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి యున్న ప్రసన్నాంజనేయస్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి హనుమత్ పడిపూజ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీక్షా స్వాములు ఏర్పాటు చేసిన పడిపూజలో లక్ష తమలపాకు సింధూర పూజను ఆలయ అర్చకులు మూర్తి శివరామ కృష్ణశాస్త్రి నిర్వహించారు. గ్రామంలో హనుమాన్ నామస్మరణ మార్మోగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని స్వామివారికి పూజలు చేశారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



నందిగామ: పట్టణ పరిధిలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 3వ వార్డు పరిధిలో జరుగుతున్న దోమల నివారణ చర్యలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 20వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డు కౌన్సిలర్ షేక్ ఖాలిక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

132 మద్యం సీసాలు పట్టివేత



నందిగామ : మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పట్టణ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ తెలిపారు. పట్టణంలోని ఫైర్‌స్టేషన్ సమీపంలో 65వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి వాహనాల తనిఖీ చేపట్టారు. అమరావతి మండలం లింగాపురం గ్రామానికి చెందిన పిచ్చయ్య , సాంబశివరావు ద్విచక్రవాహనంపై తెలంగాణ నుంచి 132 మద్యం సీసాలు తీసుకువస్తుండగా పోలీసులు తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ హనీష్ విలేకరులతో మాట్లాడుతూ అక్రమ మద్యం రవాణా అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వెంట ఎస్సై పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ పాసైన వారికి ఉచిత శిక్షణ

నందిగామ: డిగ్రీ పాసైన వారికి పేషంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సులో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సిహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలి పారు. మండలంలోని అంబారుపేట కిట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఈ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. శిక్షణాకాలంలో అభ్యర్థులకు విద్యార్థులకు ఉచిత భోజనం, వసతి సదుపాయా లు కల్పించనున్నట్లు తెలిపారు. రెండు నెలల పాటు శిక్షణ ఇచ్చిన అనంతరం కార్పొరేట్ ఆసుపత్రులలో ఉద్యోగావకాశాలు కల్పిస్తామని వివరించారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 7680945357లో సంప్రదించాలని ఆయన కోరారు.

వైభవంగా ఆప్తవాజపేయ యాగం

జుజ్జూరు(వీరులపాడు):మండలంలోని జుజ్జూరులో వేంచేసియున్న యజ్ఞదత్తాత్రేయస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న ఆప్తవాజపేయ బృహస్పతినవ మహాయాగాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు యనమదల ప్రసాద్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించగా, పెద్దసంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రగతిపథంలో పేట

- అభివృద్ధిలో దౌడు తీస్తున్న జగ్గయ్యపేట
- కోట్లాది రూపాయలతో పనులు
- పెరిగిన మౌలిక వసతులు

జగ్గయ్యపేట అర్బన్ : జగ్గయ్యపేట నియోజకవర్గం ప్రగతిపథంలో పయనిస్తోంది. పేట పట్టణంతో పాటు ఆయా మండలాల అభివృద్ధికి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతూ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో ప్రగతిపథంలో నడిపిస్తున్నారు. ముఖ్యంగా జగ్గయ్యపేట పట్టణంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టారు. సమీపంలోని జాతీయరహదారి వరకు పట్టణం విస్తరిస్తే, అభివృద్ధి మరింత వేగంగా పెరుగుతుందని భావిస్తూ ఆదిశగా చర్యలు చేపడుతున్నారు.

రూ.14కోట్లతో నాలుగు లేన్ల రోడ్డు..

జగ్గయ్యపేట-చిల్లకల్లు మధ్య ఇరుకుగా ఉన్న రహదారిని రూ.14కోట్లతో నాలుగు లేన్ల రోడ్డుగా అభివృద్ధి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో జగ్గయ్యపేటలోని వైఎస్సార్ సర్కిల్ నుంచి చిల్లకల్లు పంచాయతీ కార్యాలయం వరకు ఆధునిక హంగులతో ఈ రోడ్డును అభివృద్ధి చేశారు.

రూ.3 కోట్లతో ప్రభుత్వాస్పత్రి ఆధునికీకరణ...

ఇరుకు గదులు, అరకొర వైద్య సౌకర్యాలతో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఆధునికీకరించాలనే తలంపుతో ఎమ్మెల్యే ఉదయభాను నాబార్డు నిధులు రూ.3కోట్లు మంజూరు చేయించారు. ఈ నిధులతో అదనపు గదుల నిర్మాణం, పై అంతస్తుతోపాటు అన్ని మౌలికవసతులు కల్పించారు. అదే విధంగా ఆస్పత్రిలోని 30పడకలను 50 పడకలకు పెంచడంతోపాటు వైద్యుల సంఖ్య కూడా మూడు నుంచి పదికి పెంచారు.

పర్యాటక కేంద్రంగా ఊరచెరువు..

నియోజకవర్గ కేంద్రం జగ్గయ్యపేట పట్టణ నడిబొడ్డున సుమారు 200ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఊరచెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఎమ్మెల్యే ఉదయభాను శ్రీకారం చుట్టారు. తొలి విడతగా రూ.3.50కోట్లతో పనులు చేపట్టగా, రెండో విడతగా రూ.7కోట్లతో చెరువు అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇలా రూ.10.50కోట్లతో ఊరచెరువును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ప్రముఖ ఆర్కిటెక్చర్లతో నమూనాలు రూపొందించి పనులు చేపడుతున్నారు. ఊరచెరువును శుభ్రపరచడంతోపాటు అత్యంత సుందర వనంగా తీర్చిదిద్దుతున్నారు.

రూ.1.90కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్లు..

ప్రజల సౌకర్యార్థం రూ.1.90కోట్లతో పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు. పట్టణంలోని తొర్రగుంటపాలెంలో ఒకటి, బలుసుపాడు రోడ్‌లోని జగనన్న కాలనీలో మరొక అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్మించారు.

రూ.2.50కోట్లతో కల్యాణమండపం..

పేద, మధ్యతరగతి వారి సౌకర్యార్థం చిల్లకల్లు రోడ్డులో రూ.2.50కోట్లతో టీటీడీ కల్యాణమండపాన్ని నిర్మించారు. ఈ కల్యాణమండపం ఏర్పాటు ఎంతో సౌకర్యవంతంగా ఆర్థికంగా వెసులుబాటుగా ఉందని పట్టణప్రజలు చెబుతున్నారు.

రూ.75లక్షలతో షాదీఖానా నిర్మాణం..

ముస్లిం సోదరులకు గతంలో జామియా మసీదు ప్రక్కన ఉన్న షాదీఖానా ఇరుకుగా ఉండటంతో శిథిలావస్థకు చేరడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితిని గమనించిన ఎమ్మెల్యే ఉదయభాను కోదాడ రోడ్‌లో విశాలమైన స్థలంలో రూ.75 లక్షలతో షాదీఖానా నిర్మాణం చేపట్టారు.

జగనన్న కాలనీల నిర్మాణం...

జగ్గయ్యపేట నియోజవర్గ పరిధిలో 97 లేఅవుట్లలో జగనన్న కాలనీల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు జగ్గయ్యపేట పట్టణంతో పాటు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధిలో 9,768 ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 2168 గృహాల పనులు పూర్తయ్యాయి. మిగిలిన గృహాల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. సకాలంలో బిల్లులు, సిమెంట్ మంజూరు చేస్తుండటంతో నిర్మాణాలకు లబ్ధిదారులు ఆసక్తి కనపరుస్తున్నారు.

రూ.కోటితో హైవే బస్టాండ్ నిర్మాణం..

పారిశ్రామికవాడగా రోజురోజుకు అభివృద్ధి చెందుతున్న జగ్గయ్యపేట పట్టణం మరింత అభివృద్ధి చెందాలంటే దానిని జాతీయ రహదారి వరకు విస్తరింపజేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే ఉదయభాను జాతీయ రహదారిపై ఫుడ్‌ప్లాజా సమీపంలో రూ.1కోటి వ్యయంతో హైవే ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం చేపట్టారు. శరవేగంగా సాగుతున్న ఈ పనులు త్వరలోనే పూర్తికానున్నాయి.

టౌన్‌హాల్ అభివృద్ధి...

పట్టణ ప్రజల సౌకర్యార్థం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కన గతంలో ఎమ్మెల్యే ఉదయభాను కృషితో విశాఖ స్టీల్‌ప్లాంట్‌వారి సహకారంతో రూ.కోటి వ్యయంతో టౌన్‌హాల్ నిర్మాణం చేపట్టారు. అనంతరం వచ్చిన పాలకులు ఈ టౌన్‌హాలును పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో ఎమ్మెల్యే ఉదయభాను ఇటీవల మరో రూ.50లక్షలతో టౌన్‌హాల్‌ను అభివృద్ధి చేసి వినియోగంలోకి తెచ్చారు. పట్టణంలో గత రెండేళ్లకాలంలోనే రూ.27.27కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా జగ్గయ్యపేట అభివృద్ధిపై ప్రభుత్వవిప్ ఉదయభాను తనదైన ముద్ర వేశారని చెప్పవచ్చు. జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా తనకు ఉన్న పరిచయాలతో జగ్గయ్యపేట అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయిస్తూ నియోజకవర్గాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్న ఉదయభాను పనితీరుపై ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.





రూ.14కోట్లతో చేపట్టిన జగ్గయ్యపేట-చిల్లకల్లు రోడ్డు (ఇన్‌సెట్‌లో) విప్ సామినేని ఉదయభాను



ఆధునికీకరించిన ప్రభుత్వాస్పత్రి



పేటలో ఊరచెరువు అభివృద్ధి పనులు



పేటలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

పారిశ్రామిక వృద్ధిలో రాష్ట్రం పరుగులు



నందిగామలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



అల్లూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ఎమ్మెల్సీ అరుణకుమార్

నందిగామ టౌన్: పారిశ్రామిక వృద్ధిరేటులో రాష్ట్రం పరుగులు పెడుతోందని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ తెలిపారు. గత చంద్రబాబు ప్రభుత్వ హయాంలో పారిశ్రామికరంగ ప్రగతిలో రాష్ట్రం దేశంలో 22వ స్థానం ఉండగా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో మూడో స్థానానికి చేరడమే ఇందుకు నిదర్శమని ఆయన పేర్కొన్నారు. నందిగామ పట్టణంలోని 19, 20వార్డుల పరిధిలోని 10వ సచివాలయం, చందర్లపాడు మండలం కాసరబాద గ్రామంలో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ఆయా గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. చంద్రబాబు హయాంలో 2018-19లో 3.2శాతంగా ఉన్న పారిశ్రామిక వృద్ధిరేటు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి హయాంలో 2021-22 నాటికి 12.8 శాతానికి ఎగబాకిందని గుర్తుచేశారు. రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిందని ప్రతిపక్ష పార్టీల నాయకులు చేసే అసత్య ప్రచారాలను నమ్మవద్దని సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నందిగామ నియోజకవర్గాన్ని సైతం ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు అభివృద్ధిపథంలో పథంలో నడిపిస్తున్నారని కొని యాడారు. ముఖ్యంగా పట్టణంలో గతంలో ఎన్న డూ చూడని అభివృద్ధిని చూస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో మూడు దశాబ్దాలు అధికారాన్ని కట్టబెట్టినా టీడీపీ చేసిందేమీ లేదని విమర్శించారు. కనీసం అత్యంత రద్దీగా ఉండే సీఎం రోడ్డును కూడా అభివృద్ధి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. తాము అభివృద్ధి చేస్తుంటే మాత్రం కోర్టులను ఆశ్రయించి పనులు అడ్డుకుంటున్నారని దుయ్యబట్టారు.



నందిగామలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

ప్రజలకు తాము చేయగలిగిన దానికంటే మిన్నగా మంచి చేస్తామని తెలిపారు. అనంతరం ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పాకాలపాటి కిరణ్, ఏఎంసీ చైర్మన్ మహ్మద్‌మస్తాన్, పార్టీ పట్టణ కన్వీనర్ దొంతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్ మందా మరియమ్మ, వార్డు కన్వీనర్ కర్రి రఠవీంద్ర, కమిషనర్ డాక్టర్ జయరాం, ఏఈ ఫణి శ్రీనివాస్, పాములపాటి రమేష్, చల్లా శివయ్య, నరాల తిరుమలరెడ్డి, ఆవుల పూర్ణ, నరాల హనిమిరెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అల్లూరులో..

అల్లూరు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో కోట్లాది రూపాయలతో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో గ్రామాల స్వరూపమే మారిపోయిందని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని అల్లూరులో గురువారం రాత్రి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75ఏళ్లలో గ్రామాల్లో పంచాయతీ భవనం మాత్రమే ఉండేదన్నారు. కానీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో సచివాలయ భవనం వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, , రైతు భరోసా కేంద్రం తదితర కార్యాలయాలతో మొత్తం పాలనను గ్రామస్థాయికి తీసుకువచ్చి ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సాకారం చేసేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని కొనియాడారు. గత ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలను పూర్తిగా విస్మరించగా, ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మాత్రం అందుకు బిన్నంగా పాలన సాగిస్తూ ప్రజా మన్ననలు పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి అండగా ఉండి మద్దతు పలకాలని కోరారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బందెల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, ఎంపీపీ కోటేరు లక్ష్మి, ఏఎంసీ చైర్‌పర్సన్ కోటేరు మల్లేశ్వరి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, నాయకులు రాజగోపాల్‌రెడ్డి, కుంపటి శ్రీను, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటలను దెబ్బతీస్తున్న వర్షాలు



పెనుగంచిప్రోలులో వర్షం పడటంతో ధాన్యంపై పట్టా కప్పి యంత్రాన్ని పక్కన పెట్టిన రైతులు



పెనుగంచిప్రోలులో వర్షాలకు నేలవాలిన వరి

ఆందోళనలో అన్నదాతలు

పెనుగంచిప్రోలు: అల్పపీడన ప్రభావంతో పెనుగంచిప్రోలు మండలంలో గురువారం సాయంత్రం భారీ వర్షం పడటంతో అన్నదాతలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఈ వర్షంతో వరి, పత్తితోపాటు కోతలు కోస్తున్న మిర్చి తోటలకు తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని మునేరు ఆయకట్టున వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కొందరు కోతలు పూర్తి చేసి పొలాల్లో పనలు ఉంచారు. కొందరు ధాన్యం కూడా ఆరబోశారు. వర్ష ప్రభావంతో రైతులు కోత యంత్రాలతో హడావిడిగా కోతలు కోయిస్తున్నారు. పట్టాలతో పంటను కాపాడుకునేందుకు పాట్లు పడుతున్నారు. ఇంతటితో వర్షం ఆగితే ఫర్వాలేదని, ఇదేవిధంగా రెండుమూడు రోజులు కొనసాగితే మాత్రం నష్టపోతామని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వత్సవాయి మండలంలో..

వత్సవాయి : రెండు రోజులుగా పడుతున్న అకాల వర్షాలతో వత్సవాయి మండలంలో వరి, మిరప, పత్తిసాగు రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



వత్సవాయిలో వర్షానికి తడుస్తున్న పత్తి

ప్రస్తుతం పత్తి తీతలు ఎక్కువగా సాగుతుండగా, పత్తి పగిలి చెట్లపై ఉంది. ఈ సమయంలో వర్షాలు పడటంతో పత్తి అంతా తడిసిపోయి నల్లగా మారిపోయే అవకాశం ఉందని రైతన్నలు వాపోతున్నారు. పత్తి వ్యాపారులు కూడా వర్షం సాకుగా చూపి ధర తగ్గిస్తారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ వర్షం కారణంగా మిర్చి తోటలకు కూడా ప్రమాదం పొంచి ఉంది. దోరకాయలు వర్షానికి దెబ్బతిని తాలుకాయలుగా మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రైతులు చెబుతున్నారు. ఇక కోత దశలో ఉన్న వరి పంటకి ఈ వర్షంతో ముప్పు ఏర్పడినట్లేనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కేడీసీసీ బ్యాంకుల సేవలపై కళాజాత

కంచికచర్ల : సహకార కేంద్ర బ్యాంకులు రైతులు, డ్వాక్రా మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలను మంజూరు చేస్తున్నాయని కీర్తన కల్చరల్ సొసైటీ కళాకారుల బృంద సభ్యులు తిరుపతిరావు, విజయకుమార్ వివరించారు. కంచికచర్ల కేడీసీసీ బ్యాంకు వద్ద గురువారం వారు కళాజాత నిర్వహించారు. కేడీసీసీబీ అందిస్తున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా, సురక్షా బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు తదితర సేవలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కేడీసీసీబీ కంచికచర్ల బ్రాంచి మేనేజర్ మాహేశ్వరరావు, సూపర్‌వైజర్లు కే శ్రీనివాసరావు, హరీష్‌నాయక్, ఆయా సొసైటీల కార్యదర్శులు, రైతులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

బంగారు పతక విజేత రిషితశ్రీకి సత్కారం



పేరకలపాడు(కంచికచర్ల) : ఉమ్మడి కృష్ణాజిల్లా వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబరిచి బంగారు పతకం సాధించిన ఏపూరు రిషితశ్రీని పేరకలపాడు ఎంపీపీ స్కూల్‌లో గురువారం ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సర్పంచి ఎం.సాత్విక మాట్లాడుతూ గ్రామానికి చెందిన రిషితశ్రీ బంగారుపతకం సాధించడం అభినందనీయమని కొనియాడారు. మైలవరం లక్కిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్న రిషితశ్రీ వెయిల్‌లిఫ్టింగ్ 85 కేజీల కేటగిరిలో పాల్గొని బంగారు పతకం సాధించడంపై పాఠశాల హెచ్‌ఎం సాంబశివరావు, ఉపాధ్యాయులు కొండూరు నాగేశ్వరరావు, బి.శ్రీనివాసనాయక్ హర్షం వ్యక్తంచేస్తూ రిషితశ్రీని దుశ్శాలువ, మెమొంటోతో సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తూ రిషితశ్రీని అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

నందిగామ: సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని 'ఆచార్య దేవోభవ' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ పోటీలకు పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. వ్యాసరచనలో ప్రతిభచూపిన విద్యార్థులకు నిర్వాహకులు యు.వాసుదేవరావు బహుమతులు అందజేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



గ్రానైట్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు తెలిపారు. మండలంలోని మాగల్లులో వేంచేసియున్న లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయంలో చేపడుతున్న గ్రానైట్ లేయింగ్ పనులను వేదమంత్రోచ్చరణ నడుమ గురువారం ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే జగన్‌మోహనరావు తొలుత ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయగా, ఆలయ అర్చకుడు అంగర రాంబాబు ఆయనకు ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జగన్‌మోహనరావు మాట్లాడుతూ గతేడాది నిర్వహించిన అష్టలక్ష్మీ పొండరీక మహాయాగంలో అప్పటి తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించి, స్వామి వారి ఆలయానికి గ్రానైట్ అందిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ మేరకు వైవీ సుబ్బారెడ్డి గ్రానైట్ అందజేయడంతో పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఆలయాల పునర్నిర్మాణాలకు సైతం దేవాదాయ,ధర్మాదాయశాఖ ద్వారా పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తున్నారని గుర్తు చేశారు. అనంతరం ఎమ్మెల్యే జగన్‌మోహనరావును ఆలయ నిర్వాహకులు స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించారు. గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు సుగుణశేఖరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.